నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కే పీహెచ్‌బీకాలనీ: వసంత్‌నగర్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వాణి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు గోకుల్ ప్లాట్స్ పరిసర ప్రాంతాలు, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గోపాల్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపారాయుడు నగర్ కాలనీకి చెందిన సమ్మ రావుకు రూ.24 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును శుక్రవారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

నల్ల పోచమ్మ ఆలయ పునర్నిర్మాణం

కూకట్‌పల్లి: బాలానగర్ డివిజన్ ఇంద్రనగర్‌లో నల్లపోచమ్మ దేవాలయ పునర్నిర్మాణానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. డివిజన్ అధ్యక్షుడు మధుగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, లక్ష్మయ్య, ప్రకాష్ ముదిరాజ్, శివచౌదరి, రమణ, కనకయ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

‘పది’లో ‘వంద’ లక్ష్యం

- పదో తరగతి విద్యార్థులకు ‘ప్రత్యేక’ తరగతులు
- ఇళ్ల వద్ద విద్యార్థులు చదివేలా ఉపాధ్యాయులతో మానిటరింగ్‌పై కసరత్తు
- 108 ప్రభుత్వ పాఠశాలల్లో 8 వేల మంది విద్యార్థులు



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ బడులపై మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ స్పెషల్ ఫోకస్ పెడుతోంది. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలతో పోటీ పడే విధంగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి పథంలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే అక్టోబర్ నుంచి 108 ప్రభుత్వ బడుల్లో చదువుతున్న 8 వేల మంది విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో సాయంత్రం వేళల్లో జిల్లా విద్యాశాఖ ప్రత్యేక తరగతులు కొనసాగేలా చర్యలు తీసుకుంటోంది. ఈ ప్రత్యేక తరగతుల నిర్వాహణ కార్యక్రమాన్ని 3 ఏళ్లుగా నిర్వహించటం ద్వారా జిల్లా విద్యాశాఖ మంచి గుర్తింపును సాధించింది. అలాగే, గత బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ బడుల్లో మన బడి–మన ఊరు–మన బస్తీ పథకం కింద 176 పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణంతోపాటు మౌలిక సదుపాయాలను కల్పించగా, అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం కింద కాంగ్రెస్ ప్రభుత్వం సంబంధిత అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా 286 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.12.01 కోట్లతో 699 మరమ్మతులు తదితర అభివృద్ధి పనులను చేపట్టింది. అలాగే, ప్రపంచాన్ని కుదిపేసిన కొవిడ్ మహమ్మారి విద్యాసంస్థలపై పెను ప్రభావాన్ని చూపగా, ఆ క్లిష్ట పరిస్థితుల నుంచి విద్యార్థులను గట్టెక్కించటానికి విద్యాశాఖ ‘మేడ్చల్ బడి’ యాప్ ద్వారా ఆన్‌లైన్ తరగతులను నిర్వహించి తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి మన్నలను అందుకుంది. పుస్తక పఠనం పేరుతో రీడింగ్ క్యాంపెయిన్ నిర్వహించింది. బాలికా సాధికారత కోసం పాఠశాలల్లో కమిటీ(క్లబ్)లు, టూరిజం ప్రాధాన్యతను విద్యార్థులు తెలుసుకునేలా సర్కారు బడుల్లో పర్యాటక క్లబ్బులు ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో అనేక కార్యక్రమాలకు జిల్లా విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల విద్య కొనసాగుతుండటంతోపాటు ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలు, డ్రెస్సుల సరఫరా వంటి కార్యక్రమాల నేపథ్యంలో విద్యాశాఖ చేపట్టిన బడి బాట కార్యక్రమానికి భారీగా స్పందన లభిస్తోంది. కరోనా మహమ్మారి నేర్పిన గుణపాఠంతో మూడేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో 3 వేల నుంచి 4 వేల విద్యార్థులు చేరటం, ముఖ్యంగా ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చి మరీ ప్రభుత్వ బడుల్లో చేరారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఏ జిల్లాలో లేని విధంగా 515 ప్రభుత్వ పాఠశాలల్లో 1.07 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ–2024లో ఖాళీగా ఉపాధ్యాయ పోస్టులు కూడా భర్తీ అయ్యాయి. ఈ నేపథ్యంలోనే విద్యాశాఖ మరింత పట్టుదలతో విద్యా ప్రమాణాల మెరుగుతో పాటు పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది.



ప్రత్యేక తరగతులపై ఫోకస్

మార్చిలో జరిగే పదో తరగతి కామన్ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహించటంతోపాటు చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల వారిగా తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు, విద్యాధికారులు దశల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండల, పాఠశాల స్థాయిల్లో విద్యాధికారులు, ఉపాధ్యాయులతో సమీక్షలు నిర్వహించిన జిల్లా విద్యాశాఖ సిలబస్ రివిజన్ చేసే ప్రక్రియకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. అలాగే, ఈ నెల నుంచి జిల్లాలో 108 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆయా బడుల్లో ప్రత్యేక క్లాసులను నిర్వహిస్తోంది.

వెనుకబడిన సబ్జెక్టుల్లో స్పెషల్ క్లాసులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గతంలో పదో తరగతి విద్యార్థుల్లో ఎక్కువగా ఫెయిల్ అయినట్లు భావిస్తున్న గణితం, సామాన్య శాస్త్రం సబ్జెక్టుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వారానికి 12 పిరియడ్స్ బోధిస్తున్న ఉపాధ్యాయులు ఇందులో 4 పిరియడ్స్ గణితం, 5 పిరియడ్స్ సామాన్య శాస్త్రం, 3 పిరియడ్లు సాంఘీక శాస్త్రం, ఆంగ్లం, తెలుగు బోధించే విధంగా కసరత్తు చేస్తోంది.అలాగే, పదో తరగతి విద్యార్థులను వచ్చే ఫిబ్రవరి నుంచి ప్రతి రోజు ఉదయం 4 నుంచి 5 గంటల వ్యవధిలో ఫోన్ల ద్వారా నిద్ర లేపేందుకు ప్రత్యేక తరహాలో ఉపాధ్యాయులను కేటాయించటంతో పాటు వారి పని తీరును పర్యవేక్షించేందుకు జిల్లా విద్యాశాఖ కార్యాచరణ ప్రణాళిక ఖరారుతో ముందుకు సాగుతోంది.



టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



సబ్జెక్టుల వారీగా చదువుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించాం. వారికి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. గతంలో తక్కువగా వచ్చిన ప్రైవేట్ స్కూళ్లపై కూడా దృష్టి సారిస్తున్నాం. వంద శాతం విద్యార్థుల ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రత్యేకంగా నోట్స్ తయారు చేసి అందజేస్తున్నాం. – విజయకుమారి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా డీఈఓ

నేడు వరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠ

కూకట్‌పల్లి: సంగీత్‌నగర్‌లోని స్వాన్‌లేక్ అపార్టుమెంట్‌లో శ్రీ వరసిద్ధి వినాయక స్వామి విగ్రహాన్ని శనివారం ప్రతిష్ఠించనున్నారు. సోమవారం వరకు వివిధ పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ పేర్కొంది. శనివారం ఉదయం 5 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, ఋత్విక్ వరణం, యాగశాల ప్రవేశం, ఆదివారం ఉదయం 8 గంటలకు స్థాపిత దేవాతా హవనం, గణపతి శీర్ష హోమం, నవగ్రహ యోగిని, జలదివాస, ధాన్యదివాస, శయ్యాదివాస, పుష్పాది వాసములు, తీర్ధ ప్రసాద వితరణ, సోమవారం ఉదయం ఆదివాస హోమాలు, అనంతరం విఘ్నేశ్వర స్వామి యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ కలశ ప్రతిష్ఠాపనము, పూర్ణాహుతి, పండిత ఆశీర్వచనములు, తీర్ధ ప్రసాదములు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి


డ్రైనేజీ సమస్యను పరిశీలించి మాట్లాడుతున్న కమలాకర్‌రెడ్డి

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కమలాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎల్లమ్మబండ, పీజేఆర్ నగర్ కాలనీలో సమస్య నెలకొన్న ప్రాంతంలో బీజేపీ నాయకులతో కలిసి పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్య పీజేఆర్ నగర్ కాలనీ వాసులకు శాపంగా మారిందని, వెంటనే సమస్యకు పరిష్కారం చూపాలని వాటర్‌వర్క్స్ డీజీఎం నాగప్రియతో ఫోన్‌లో మాట్లాడారు.

అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ



మోతీనగర్: మూసాపేట డివిజన్ స్నేహపురి కాలనీకి చెందిన మారూరి విశ్వనాథ్ చారి, లక్ష్మణ్, శ్రీనివాస్ కుటుంబ సభ్యులు లలిత అమ్మవారికి 850 గ్రాముల వెండి కిరీటాన్ని చేయించారు. శుక్రవారం ఆలయ ప్రధాన సేవకుడు రమేష్ అయ్యంగారుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కిరీటాన్ని అందజేసిన భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత

సుభాష్‌నగర్: ఆలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. శుక్రవారం గాజులరామారం డివిజన్ అంబేడ్కర్ నగర్‌లోని ధామ దీప్ బుద్ధ విహార్‌లో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ప్రెసిడెంట్ సంతోష్ బాన్సువాడే, వైస్ ప్రెసిడెంట్ దండేరాజు, కమిటీ సభ్యులు అనిల్, రమేష్, సునీల్, గణేష్, రాము, సంతోష్, సంజయ్, శివ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


ఎమ్మెల్యే కృష్ణారావుతో సమావేశమైన కార్పొరేటర్ సబిహా బేగం, స్థానికులు

కూకట్‌పల్లి: అల్లాపూర్ డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం అల్లాపూర్‌లోని ప్రజా సమస్యలపై కార్పొరేటర్ సబిహా బేగం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలు ఉన్నాయని, అదే విధంగా హైడ్రా పేరుతో రాజీవ్‌గాంధీ నగర్, సఫ్దార్‌నగర్ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డ్రైనేజీ సమస్యలతో పాటు ఎవరికి ఎటువంటి ఇబ్బందులు వచ్చినా తాను అండగా ఉంటానన్నారు. ఎన్నో సంవత్సరాలుగా నివాసాలు ఉంటున్నారని, ప్రజలు ధైర్యంగా ఉండాలన్నారు. నివాసాలు ఉంటున్న నిరుపేదల జోలికి వస్తే తాను అండగా నిలబడతానని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు గౌసుద్దీన్, ఐలయ్య, వీరారెడ్డి, బాబా, పలు కాలనీ అసోసియేషన్‌ల సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు మెగా జాబ్ మేళా


జాబ్‌మేళాకు హాజరైన మహిళలు, ప్రతినిధులు

మోతీనగర్: కష్టపడి పనిచేసే తత్వం ఉంటే ఏ రంగంలోనైనా దినదినాభివృద్ధి చెందుతారని నిర్మాణ సేవా సంస్థ ప్రతినిధి సంపత్ కుమార్ అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌లో శుక్రవారం మహిళలకు మెగా జాబ్ మేళా నిర్వహించారు. పలు కంపెనీల ప్రతినిధులు మేళాకు హాజరయ్యారు. ప్రతిభ గల మహిళలను ఎంపిక చేసి నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ రంగంలో కూడా ప్రతిభను గుర్తించి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, వాటిని సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ ఎస్ బిల్డర్స్ పి. శ్రీనివాసరావు, వీడియో కంపెనీల ప్రతినిధులు శశికాంత్, పావని, శైలేష్, శ్రీనివాసరావు, రఘుపతి, స్వామి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో మహిళలకు ప్రాధాన్యం


మహిళా కార్యకర్తలతో దినేష్‌కుమార్, గంధం రాజు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీకి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ మహిళా కార్యకర్తలు శుక్రవారం గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి దినేష్‌కుమార్, కేపీహెచ్‌బీ కంటెస్టెడ్ కార్పొరేటర్ గంధం రాజులను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో మహిళలకు సముచిత స్థానం ఉంటుందన్నారు. మహిళా సభ్యత్వ నమోదులో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో ఉండటం సంతోషకరమన్నారు. సభ్యత్వ నమోదులో భాగస్వాములైన మహిళలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో దార్ల వనజ, సుజాత, వరలక్ష్మి, వీణ, రోజ, వాణి, సరోజ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి


బోయిన్ చెరువును పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, అధికారులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. శుక్రవారం జీహెచ్ఎంసీ ఈఈ గోవర్ధన్‌గౌడ్, ఏఈ ఆశ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌తో కలిసి బోయిన్ చెరువు దగ్గర వాకింగ్‌ట్రాక్ నిర్మాణం, రేలింగ్ పనులను పరిశీలించారు. అనంతరం హస్మత్‌పేట హిందూ శ్మశాన వాటికను పరిశీలించారు. శ్మశాన వాటికలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్నానపు గదులతో పాటు ఇతర అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులపై అధికారులతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బుర్రి యాదగిరి, చందుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ తల్లిని దర్శించుకున్న ఎంపీ



మూసాపేట: మూసాపేట భవానీ నగర్‌లోని పోచమ్మ తల్లి ఆలయ 25వ వార్షికోత్సవ వేడుకల్లో గురువారం రాత్రి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఎంపీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కోడిచర్ల మహేందర్, కాలనీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, నాయకులు ఐలయ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు- 3 పరీక్షకు 118 కేంద్రాలు



సాక్షి,సిటీబ్యూరో: నవంబరు 17, 18 తేదీల్లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించనున్న గ్రూప్–3 పరీక్షకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 118 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని డీఆర్‌ఓ హరిప్రియ తెలిపారు. శుక్రవారం సచివాలయం నుంచి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్- 2,3 పరీక్షలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి, సభ్యులు కలెక్టర్లతో నిర్వహించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ పలు విషయాలను పేర్కొన్నారు. జిల్లాలో 71,356 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు డీఆర్‌ఓ తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనల మేరకు జిల్లాలో 7 స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

సెంట్రల్ టెలికాం బోర్డు సభ్యుడిగా బైండ్ల కుమార్

గచ్చిబౌలి: బీజేపీ జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్‌ను కేంద్ర టెలికాం బోర్డు సభ్యుడిగా నియమించారు. ఈ మేరకు నియామకపత్రాన్ని శుక్రవారం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ.. పార్టీ కోసం ఎన్నో ఏళ్ల నుంచి నమ్మిన సిద్ధాంతం కోసం పార్టీ గెలుపునకు నిరంతరం పనిచేస్తున్న కార్యకర్తలను పార్టీ గుర్తించి బైండ్లకుమార్‌ను ఎంపిక చేయడమే నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా కుమార్‌ను ఆయన అభినందించారు.

మరమ్మతులు చేపట్టరా?


రోడ్ల మధ్యలో ఏర్పడిన గుంత

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని శ్రీహరినగర్‌లో రెండు రోడ్ల మధ్యలో గుంత ఉండటంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెల రోజుల క్రితం శ్రీహరి నగర్‌లోని వసుంధర ఆసుపత్రి నుంచి సీసీ రోడ్డు నిర్మించారు. అటు వైపు మెయిన్‌రోడ్డుకు కొత్తగా నిర్మించిన రోడ్డుకు 10 అడుగుల వెడల్పు రోడ్డు నిర్మించలేదు. దీంతో చిన్న వర్షం పడినా నీరు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది. వాహనాల రాకపోకలతో గుంత ఇంకా పెద్దదిగా అవుతోంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ఇన్సూరెన్స్ కాన్ఫరెన్స్-2024 సదస్సు ప్రారంభం

రాయదుర్గం: బీమా రంగంలో సైబర్ రిస్క్, మోటార్ పూల్ కార్యకలాపాలకు సంబంధించిన సవాళ్లతో సహా ఉద్భవిస్తున్న ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐఆర్‌డీఏఐ) సభ్యుడు సత్యజిత్ త్రిపాఠి సూచించారు. నానక్‌రాంగూడలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్సూరెన్స్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్(ఐఐఆర్ఎం) క్యాంపస్ ఆవరణలో ప్రపంచంలో అతి పెద్ద ఇన్సూరెన్స్ సంస్థ స్విస్‌రే సౌజన్యంతో ఐఐఆర్ఎం, తెలంగాణ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో ‘ఇన్సూరెన్స్: న్యూ నార్మల్’అనే థీమ్‌తో ప్రతిష్ఠాత్మకమైన ఇన్సూరెన్స్ కాన్ఫరెన్స్–2024 సదస్సును ఆయన జ్యోతి వెలిగించి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవడంతో పాటు ప్రక్రియలను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. ఐఐఆర్ఎం డైరెక్టర్ అంతనుకుమార్‌దాస్ మాట్లాడుతూ.. బీమారంగంలో 5.0 ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.

చెకుముకి సంబరాలు - 2024ను విజయవంతం చేయాలి

పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ విజయకుమారి, అదనపు కలెక్టర్ రాధికా గుప్తా తదితరులు

సాక్షి,సిటీబ్యూరో: చెకుముకి సైన్స్ సంబరాల్లో విద్యార్థులను భాగస్వాములను చేసి విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జన విజ్ఞాన వేదిక చెకుముకి సంబరాలు–2024 పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి మాట్లాడుతూ.. బాల్యదశ నుంచే విద్యార్థుల్లో మూఢ నమ్మకాలను తొలగించి, సైన్స్ పట్ల ఆసక్తి కలిగించడానికి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల స్థాయిలో నిర్వహిస్తున్న చెకుముకి టాలెంట్ టెస్టులు, విద్యార్థి దశలో ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. జన విజ్ఞాన వేదిక పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ బి.ఎస్.రెడ్డి మాట్లాడుతూ.. నవంబర్ 7న పాఠశాల స్థాయిలో, నవంబర్ 21న మండల స్థాయిలో, నవంబర్ 28న జిల్లా స్థాయిలో, డిసెంబర్ 14,15,16 తేదీలలో ఆదిలాబాద్‌లో రాష్ట్ర స్థాయిలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రావు, మేడ్చల్ జిల్లా నాయకులు జెన్నీ, రామ్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు వీసీగా నియమితులైన ప్రొఫెసర్ శ్రీనివాస్‌కు సన్మానం



కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.ఎన్ శ్రీనివాస్‌ను పాలమూరు యూనివర్సిటీ వీసీగా ప్రభుత్వం ప్రకటించింది. శుక్రవారం యూనివర్సిటీలో ఆయన ఛాంబర్‌లో జేఎన్‌టీయూ విద్యార్థి నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎరవెల్లి జగన్, లకావత్ భానుప్రకాష్ నాయక్, విద్యార్థులు హేమంత్ , సన్నీ తదితరులు పాల్గొన్నారు.


ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ అవార్డు అందుకుంటున్న క్లినాక్సి సొల్యూషన్స్ చైర్మన్ వేమవరపు సతీష్‌కుమార్ - కూకట్‌పల్లి